క్లుప్తంగా

దరఖాస్తుకు 31వరకు గడువు

న్యూశాయంపేట : తెలంగాణ మైనారిటీ రెసిడెన్సియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్స్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 31 వరకు గడువు పొడిగించినట్టు హనుమకొండ జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి మేన శ్రీను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న నాలుగు గురుకులాల ప్రిన్సిపాల్స్‌ను గానీ సుబేదారిలోని కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో ఉన్న కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మడికొండ: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని మడికొండ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 4 నుంచి 23వ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే కరీంనగర్ జిల్లా అలుగునూర్ విద్యాసంస్థ, గొలిదొడ్డి బాలికల విద్యాసంస్థ (సీఓఈ)లో 9వ తరగతిలో మాత్రమే రెగ్యులర్ ప్రవేశాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గుట్టపై జెండావిష్కరణ



కాజీపేట రూరల్ : కాజీపేట సోమిడిగుట్టపై 25 ఫీట్లతో కూడిన జైశ్రీరాం జెండాను మంగళవారం ఆవిష్కరించినట్లు భక్త నిర్వాహకులు, స్థానిక పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, కృష్ణ, పెసరు లక్ష్మణ్‌రావు, భాస్కర్ రావు, లక్ష్మణ్, సుభాష్, చంద్రగుప్తా, బైరి రమేష్ పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

హసన్‌పర్తి: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మంగళవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమానికి కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పరీక్షల్లో ప్రతి విద్యార్థి 10 జీపీఏ సాధించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు తిరుపతి, నాయకులు దాసరి రాజు, తాళ్ల రమేష్, శ్యాంసుందర్, పాల్గొన్నారు.

వాణిజ్యసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మహేందర్



కాజీపేట: పట్టణానికి చెందిన కాలమాల మహేందర్ టీటీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపు ఉత్తర్వులను మంగళవారం పార్టీ వరంగల్ పార్లమెంటరీ అధ్యక్షుడు అర్షనపల్లి విద్యాసాగర్ రావు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ తన నియామానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బ్యాడ్మింటన్‌లో శ్రీచేతన్‌కు గోల్డ్‌మెడల్



వరంగల్ అర్బన్/రామన్నపేట : హైదరాబాద్‌లో ఈ నెల 8 నుంచి 11 వరకు జరిగిన 'ది గాడియం సబ్ జూనియర్ బాడ్మింటన్ ఓపెన్ చాంపియన్‌షిప్–2024' టోర్నమెంట్‌లో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సామల శ్రీచేతన్ శౌర్య బోయ్స్ గోల్డ్ మెడల్ సాధించాడు. మీర్ హాజీర్ హుస్సేన్ బోయ్స్ అండర్ విభాగం–11 సింగిల్స్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. క్రీడాకారులను స్పోర్ట్స్ డైరెక్టర్ శంకర్ లింగం బ్యాడ్మింటన్ కోచ్ శ్రీధర్ అభినందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. భవానినగర్, హౌజింగ్ బోర్డు కాలనీ, సర్క్యూట్ హౌజ్ రోడ్డు ప్రాంతాల్లో, యాదవనగర్, రెడ్డి కాలనీ, కృష్ణా కాలనీ, దుర్గా కాలనీ, పద్మశాలి భవన్, రాయపుర, లోటస్ కాలనీ ప్రాంతాల్లో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

టీఎస్‌జేయూ ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్



కాశిబుగ్గ : తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శివనగర్‌కు చెందిన ఓ నేషనల్ ఛానల్ ప్రతి నిధి తోకల అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్ కార్యాయంలో జరిగిన సమావేశంలో టీఎస్‌జేయూ నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కరానికి కృషి చేస్తానన్నారు.

కేయూ గేట్ వద్ద విద్యార్థుల ధర్నా

- బ్రేక్‌ఫాస్ట్ ఇడ్లీ అయిపోవటంతో ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్లలో ఉంటున్న పలువురు విద్యార్థులు కామన్ మెస్ వద్దకు మంగళవారం ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌కోసం వెళ్లగా ఆ సమయానికి మెనూ ప్రకారం పెట్టే ఇడ్లీ అయిపోయాయి. అప్పటికే ఎక్కువ శాతంమంది విద్యార్థులు బ్రేక్‌ఫాస్ట్ చేసి వెళ్లిపోయారు. ఇడ్లీ అయిపోయినందున వేరే కిచిడి గానీ ఉప్మా గానీ వండిపెడుదామని సంబంధిత సిబ్బంది తెలిపారని సమాచారం. అయితే తమకు ఇడ్లీ కావాలని విద్యార్థులు కోరారని సమాచారం. అనంతరం ప్లేట్లు చేతబూని యూనివర్సిటీ మొదటిగేట్ వద్దకు వచ్చి గేట్‌ను మూసివేసి గేట్ ఎదురుగా బైఠాయించి ప్లేట్లతో నిరసన తెలిపారు. విద్యార్థులు మాట్లాడుతూ సామర్థ్యానికి మించి కామన్‌మెస్‌లో 1000 మందికి పైగా విద్యార్థులకు మెస్‌కార్డులు ఇచ్చి అడ్మిషన్లు కల్పించారన్నారు. సరైన నాణ్యత లేని భోజనం పెడుతున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులకు తమ సమస్యలు చెప్పినప్పటికీ పరిష్కరించటంలేదని ఆరోపించారు. యూనివర్సిటీ వీసీ స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. సమాచారం అందుకున్న కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ఆచార్య శ్రీనివాస్‌రావు అక్కడికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. అలాగే పోలీస్ అధికారి కూడా వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. ఈ విషయంపై కేయూ హాస్టళ్ల డైరెక్టర్ మాట్లాడుతూ కామన్‌మెస్‌లో బ్రేక్‌ఫాస్ట్ విద్యార్థులకు ఉదయం 7.30నుంచి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. అయితే ఎక్కువ శాతం మంది బ్రేక్‌ఫాస్ట్ తిన్నాక కొద్దిమంది ఆలస్యంగా వచ్చారని దీంతో ఇడ్లీ అయిపోయాయన్నారు. తమకు ఇడ్లీనే కావాలని పట్టుబట్టారని జాయింట్ డైరెక్టర్ ద్వారా ఆయా కొద్దిమంది విద్యార్థులను ఓ హోటల్‌కు తీసుకెళ్లి బ్రేక్‌ఫాస్ట్ చేయించారని శ్రీనివాస్‌రావు వివరణ ఇచ్చారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే



కొబ్బరికాయ కొట్టి అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

కాజీపేట అర్బన్ : వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు తెలిపారు. 44వ డివిజన్ తరాలపల్లిలో మంగళవారం సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్స్‌తో పాటు పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో తరాలపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 44వ డివిజన్ అధ్యక్షుడు సట్ల సదానందంగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నర్మెట వెంకటరమణగౌడ్, యాదవరెడ్డి, సుధాకర్, బషీర్, సంతోష్, రవి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'బ్యాక్‌లాగ్' లేకుండా నియామకాలు చేపట్టాలి



మాట్లాడుతున్న కల్లెపెల్లి ప్రశాంత్

కేయూ క్యాంపస్: బ్యాక్‌లాగ్ పోస్టులు లేకుండా గురుకులాల్లో నియామకాలు చేపట్టాలని బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ కల్లెపెల్లి ప్రశాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీలోని లైబ్రరీ ప్రాంతంలో నిరుద్యోగ విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకుల నియామకాల్లో రీలింక్విష్‌మెంట్ పద్ధతిని పాటించి అవరోహణ క్రమంలో ఉద్యోగాలు భర్తీ చేయకుండా డిగ్రీ లెక్చరర్ల, జూనియర్ లెక్చరర్ల ,పీజీటీ, టీజీటీ పోస్టులను ప్రభుత్వం తొందరపాటుగా నియమించారన్నారు .దీంతో బ్యాక్ లాగ్ పోస్టులు ఏర్పడ్డాయన్నారు. జేఎల్, పీజీటి, టీజీటీ పోస్టులకు 1:2 సెలక్ట్ అయిన మెరిట్ కలిగిన అభ్యర్థులకు తీవ్రఅన్యాయం జరుగుతుందన్నారు. గ్రూప్–2,3 పోస్టుల, డీఎస్సీ టీచర్ల పోస్టుల సంఖ్యను పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు శివకుమార్, పరిశోధక విద్యార్థులు వెంకన్న, రాజేందర్, శివ, నవీన్, విష్ణు, రమేష్, రాజేష్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పుస్తకాలు చదవాలి



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ షీభారాణి

దేశాయిపేట : గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదవడం వల్ల మేధస్సు పెరుగుతుందని 3వ డివిజన్ కార్పొరేటర్ జన్ను షీభారాణి అన్నారు. ఆరెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించి పాఠశాలలోని అన్ని తరగతుల విద్యార్థులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని గ్రంథాలయంలోని 'రూమ్ టు రీడ్' సంస్థ అందించిన కథల పుస్తకాలను పిల్లలచే చదివించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలు సబ్జెక్టు విషయాలు కాకుండా గ్రంథాలయ పుస్తకాలు చదవడం ద్వారా మానసికంగా ఎదుగుతారని అదేవిధంగా వారికి చదువు పట్ల ఆసక్తి పెరిగి ఉత్సాహాన్ని కనబరుస్తారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్. నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

17న లింగమూర్తి సంతాప సభ

ఖిలా వరంగల్: వరంగల్ కాశిబుగ్గ లక్ష్మీపురం కమ్యూనిటీ హాల్‌లో ఈనెల 17న పీడిత ప్రజల పక్షపాతి, ఐఎఫ్‌టీయూ జాతీయ కార్మిక ఉద్యమనేత కూరపాటి లింగమూర్తి సంతాప సభను నిర్వహించనున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ తెలిపారు. ఈమేరకు మంగళవారం వరంగల్ ఫోర్ట్‌రోడ్డులో సంతాప సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా నేత కోటేశ్వర్‌రావు, బాలరాజు,రాజేందర్, ప్రభాకర్, రాజు, నారాయణ పాల్గొన్నారు.

ముస్లింలపై పట్టింపులేని ప్రభుత్వం

హన్మకొండ: ముస్లింలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పట్టింపు లేదని బీఆర్ఎస్ మైనారిటీ నాయకుడు నయీమొద్దీన్ విమర్శించారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రారంభమైన మసీద్, ఈద్గాల వద్ద కనీస ఏర్పాట్లు కరవయ్యాయని తెలిపారు. రాష్ట్ర కేబినెట్‌లో ముస్లింలకు చోటు లేదన్నారు. సమావేశంలో అఫ్జల్, సలీల్, హాజీద్, పులి రజినీకాంత్, సారంగపాణి, రవీందర్ రావు, శ్రీధర్, ఉపేందర్, కోటేశ్వర్ పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



కాశిబుగ్గ : గ్రేటర్ వరంగల్ 35వ డివిజన్ శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్, ఓటింగ్, కౌంటింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు కొమ్మోజు శ్రీధర్ పర్యవేక్షణలో విద్యార్థులే బూత్ ప్రిసైడింగ్ అధికారులు, రక్షణ కల్పించే పోలీసులుగా వ్యవహరించి నిజమైన ఎన్నికల మాదిరిగా పోలింగ్ నిర్వహించారు. ఈ మాక్ పోలింగ్‌తో విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుందని హెచ్ఎం తెలిపారు.

మూడు నెలల వేతనాలు చెల్లించాలి



జీఎంహెచ్ ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

హన్మకొండ చౌరస్తా: గత మూడు నెలలుగా వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది మంగళవారం ఉదయం విధులు బహిష్కరించి ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాకు స్పందించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి ఇక నుంచి ప్రతి నెల 10వ తేదీలోగా వేతనాలు చెల్లించేలా ఆల్ సర్వీస్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ధర్నా విరమించి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మెట్టు రవి మాట్లాడుతు భవిష్యత్‌లో ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ను సీనియారిటీ ప్రాతిపదికన భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో కాయిత కళావతి, ఎలుకటి అనిల్, కోమల, పుష్పమాల, తిరుపతి, ప్రశాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

16న మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠ

- హాజరుకానున్న మంత్రి సురేఖ
- ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లయ్య వెల్లడి



మాట్లాడుతున్న ఒడ్నాల మల్లయ్య

ఖిలా వరంగల్: ఈనెల 16న శ్రీ శివపార్వతి సమేత భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు ఒడ్నాల మల్లయ్య తెలిపారు. మంగళవారం శివనగర్‌లోని పద్మశాలి పరస్పర సహాయక సహకార పరపతి సంఘం, భవన సమితి ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణ కమిటీ కన్వీనర్ ఒడ్నాల సదానందం అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ 16న ఉదయం 11.45 నిమిషాలకు శివపార్వతి సమేత భక్తమార్కండేయ, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, అభయాంజనేయ, నవగ్రహ విగ్రహ సహిత ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 14న ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనము, సాయంత్రం 3 గంటలకు జలాధివాసం, హారతి, మంత్రపుష్పం తీర్థప్రసాద వితరణ ఉంటుందని వివరించారు. 15న ఉదయం 8 గంటలకు మండప పూజ, మూల మంత్రహవనములు, సాయంత్రం 4గంటలకు ధాన్యాదివాసం, పుష్పాదివాసం, ఫలాదివాసం శయ్యాదివాసం, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు.16న విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం మహాన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యేలు హాజరుకానున్నారని తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు మాచర్ల వెంకటేశ్వర్లు, బుదారపు భాస్కర్, ఊరుగొండ సారంగపాణి, రాంపెల్లి చంద్రమౌళి, రాజేంద్రప్రసాద్, రాజేశ్వర్‌రావు, రవి, మధు, భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వరంగల్: వరంగల్ శంభునిపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. 5వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. హెచ్ఎంగా అయేషా షిరీన్, ఎంఈఓగా గౌస్‌పాషా వ్యవహరించారు. ఉపాధ్యాయులుగా తైసీం, మహిన్, కౌసర్, యశ్రా, సాయి కల్యాణి, గంగారాం, రేహాన్ బాబా, అలీం పాషా, రంజాన్‌లు విధులు నిర్వర్తించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సోల శ్రీనివాస్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం శారదాబాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్టీ మారుతావా అంటూ వ్యక్తిపై దాడి

- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

ఖిలా వరంగల్ : పార్టీ మారుతావా..! అంటూ కుల పెద్దపై ఓ వ్యక్తి దాడి చేసిన సంఘటన సోమవారం రాత్రి ఉర్సు కరీమాబాద్ రజకవాడలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన కథనం ప్రకారం.. మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావు నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరేందుకు సోమవారం కరీమాబాద్‌లోని రజకవాడలో కుల సమావేశం నిర్వహించారు. 'బీఆర్ఎస్ పార్టీతో రజకులు అనేక రకాల లబ్ధిపొందారు.. పార్టీ ఎలా మారుతావు' అంటూ శివ అనే వ్యక్తి దుర్భాషలాడుతూ కులపెద్ద రాముల సదానందంపై దాడి చేశాడు. దీంతో సదానందం భుజానికి గాయం కాగా, కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలించారు. బాధిత కుటుంబ సభ్యులు డయల్–100కు ఫోన్ చేయగా మిల్స్‌కాలనీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం దాడి చేసిన వ్యక్తిపై సదానందం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

సంక్షిప్త సమాచారం

శంభునిగుడి హుండీ లెక్కింపు

ఖిలా వరంగల్: మధ్యకోటలోని స్వయంభూ శ్రీశంభులింగేశ్వరస్వామి దేవాలయంలో శివరాత్రి మహోత్సవానికి ఏర్పాటు చేసిన హుండీలను మంగళవారం ఆలయ ప్రాంగాణంలో లెక్కించారు. దేవాదాయశాఖ ఈఓ ఎస్. వెంకట్రావు ఆధ్వర్యంలో కార్పొరేటర్లు సువర్ణ పర్యవేక్షణలో లెక్కించారు. 6 హుండీల ద్వారా మొత్తంరూ. రూ.1,26,025 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు.

పూడికతీత పనులు విధిగా చేపట్టాలి

వరంగల్ చౌరస్తా : 27 డివిజన్‌లోని అబ్బనికుంట, యాకుబ్‌పురాలో శానిటేషన్ పనులను మంగళవారం బల్దియా సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేశ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రాజేశ్‌కు డివిజన్ల నెలకొన్న సమస్యలను టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ వివరించారు.


ఎంపీ వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళన

కాజీపేట: బీజేపీకి సంపూర్ణ మెజారిటీ వస్తే భారత రాజ్యాంగాన్ని మారుస్తామంటూ కర్ణాటక ఎంపీ అనంత కుమార్ హెగ్డే వ్యాఖ్యానించడాన్ని నిరసిస్తూ మంగళవారం కాజీపేట చౌరస్తాలో తేజో మయి మాల కులసంక్షేమ సంఘం సభ్యులు రాస్తారోకో నిర్వహించారు. సంఘం నగర అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో కడిపికొండ క్రాస్ రోడ్డు నుంచి నిరసన ర్యాలీ నిర్వహించారు.

వేతనాలు అందించాలి

హన్మకొండ అర్బన్ : జిల్లాలోని ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ధరణి ఆపరేటర్లు గత 11 నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నట్లు ఆపరేటర్లు తెలిపారు. మంగళవారం జిల్లా కోఆర్డినేటర్, ధరణి ఆపరేటర్లు కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కేయూ క్యాంపస్: హనుమకొండ సుబేదారిలోని కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కళాశాల డిగ్రీ 1971–74 బ్యాచ్‌కు పూర్వ విద్యార్థులు మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి అధ్యక్షతన జరిగిన సమ్మేళనంలో పూర్వ విద్యార్థి రాంరెడ్డి మాట్లాడుతూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఉత్తర తెలంగాణలోనే మొట్టమొదటి విద్యా సంస్థ అని అన్నారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

హసన్‌పర్తి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని జిల్లా విద్యాకమిటీ మాజీ సభ్యుడు చకిలం రాజేశ్వర్‌రావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాల వీడ్కోలు సమావేశం మంగళవారం జరిగింది. ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి, విజయలక్ష్మి, పాల్గొన్నారు.

గద్దర్ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలి

హసన్‌పర్తి: నగరంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో యుద్ధనౌక గద్దర్ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని విగ్రహ కమిటీ నాయకులు కోరారు. మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజును కలిసి వినతిపత్రం అందించారు. విగ్రహం ఏర్పాటుకు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడికి సన్మానం



కరీమాబాద్: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన జాటోత్ హుస్సేన్ నాయక్‌ను మంగళవారం గ్రేటర్ వరంగల్ పరిధిలోని 43వ డివిజన్ బీజేపీ నాయకులు సన్మానించారు. రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మల్లాడి రాంరెడ్డి, పర్వతగిరి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, రాష్ట్ర గిజరిన మోర్చా కార్యవర్గ సభ్యుడు వినోద్‌లున్నారు.

సావిత్రిబాయి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

హసన్‌పర్తి: సావిత్రిబాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం కార్యక్రమాన్ని, సావిత్రి బాయి వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. డీటీఎఫ్ హన్మకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో హసన్‌పర్తిలోని కేజీబీవీలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చైర్మన్లను కలిసిన నాయకులు

న్యూశాయంపేట : ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ గులామ్ అఫ్జల్ బియాబాని (ఖుస్రూపాషా), వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీలను సోమవారం హైదరాబాద్‌లో వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు పీసీసీ సభ్యులు మహ్మద్ అయూబ్ నేతృత్వంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.


పెన్షనర్లు విరాళాలు అందజేయాలి

కాశిబుగ్గ : తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి పెన్షనర్లు తమ వంతు విరాళాలు అందజేయాలని జిల్లా అధ్యక్షుడు తుమ్మ వీరయ్య కోరారు. ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ శివనగర్ వారి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఏసీరెడ్డినగర్ సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 10 మంది మహిళలను శాలువాతో సన్మానించారు.

కమిషనర్‌ను కలిసిన ఇన్‌స్పెక్టర్లు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల పోస్టింగ్‌లు పొందిన ఇన్‌స్పెక్టర్లు మంగళవారం వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. కేయూ ఇన్‌స్పెక్టర్ సంజీవ్, హన్మకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షూకూర్‌లు కలిసి పూలమొక్క అందజేశారు.

వైబ్రంట్ అకాడమీ కార్యాలయం ప్రారంభం



హన్మకొండ: హనుమకొండ బాలసముద్రంలో ఏర్పాటు చేసిన వైబ్రంట్ కార్యాలయాన్ని మంగళవారం ఆ సంస్థ డైరెక్టర్ విమల్ కుమార్ జైస్వాల్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ, నీట్ వంటి సంస్థలలో సీటు సాధించేందుకు అత్యుత్తమ కోచింగ్ రాజస్థాన్ కోటాకు చెందిన వైబ్రంట్ అకాడమీ అందిస్తుందన్నారు. దక్షిణ భారత దేశంలో మొదటి కోచింగ్ సెంటర్‌ను హనుమకొండలో ఏర్పాటు చేశామన్నారు.

ఉచిత విద్య అందించడం అభినందనీయం

హన్మకొండ: అనాథ పిల్లలకు గౌతమి హైస్కూల్ యాజమాన్యం ఉచితంగా విద్య అందించడం అభినందనీయమని 58వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్మడి లోహిత అన్నారు. సోమవారం రాత్రి హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో ఎన్జీవోస్ కాలనీలోని గౌతమి హైస్కూల్ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమాన్ని లోహిత ప్రారంభించి మాట్లాడుతూ అనుభవం గల ఉపాధ్యాయలచే కార్పొరేట్ తరహాలో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా ఉప విద్యాధికారి బూర విద్యాసాగర్, హైస్కూల్ సెక్రటరీ, ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు, కరస్పాండెంట్ శ్రీలత, పాల్గొన్నారు.

వైద్యశిబిరం ప్రారంభం

వరంగల్ లీగల్ : ఉమ్మడి వరంగల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం వరంగల్, హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తులు కె.రాధాదేవి, ఎం.కృష్ణమూర్తిలు ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ల అధ్యక్షులు ఎలుకుర్తి ఆనంద్‌మోహన్, వై.శ్యాంసుందర్‌రెడ్డి, ప్రతినిధులు, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భీమ్‌దీక్ష

కేయూ క్యాంపస్: మహనీయుల జయంతి సందర్భంగా ఈనెల 15 నుంచి ఏప్రిల్ 14 వరకు పవిత్ర మాసంగా భావిస్తూ భీమ్‌దీక్ష తీసుకోవటం జరుగుతుందని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్(బీఎస్ఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ తెలిపారు. మంగళవారం కేయూ గేట్ వద్ద భీమ్‌దీక్ష పోస్టర్లను ఆవిష్కరించారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

కాజీపేట అర్బన్ : బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ(ఎస్జీటీ) అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందజేయనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీవీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 22 లోపు ఆన్‌లైన్‌లో www.tsbcstudy circle.cgg. gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఆరోగ్యవంతులు రక్తదానం చేయాలి

హన్మకొండ: ఆరోగ్యవంతులందరూ రక్తదానం చేయాలని 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత అన్నారు. మంగళవారం హనుమకొండ కనకదుర్గ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడుతూ తలసేమియా బాధితుల కోసం ఈ రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. శిబిరంలో జనార్దన్‌రెడ్డి 90వ సారి రక్తదానం చేశారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

ఖిలా వరంగల్: ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని హజ్రత్ సయ్యద్ అబ్దుల్లా ఖాసీం షాహిద్ దర్గా అధ్యక్షుడు ఎంఏ జబ్బార్, మాజీ కార్పొరేటర్ బాసాని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం 39వ డివిజన్ ఏకశిలనగర్‌లోని హజ్రత్ సయ్యద్ అబ్దుల్లా ఖాసీం షాహిద్ దర్గా ప్రాంగణంలో బోరు ఏర్పాటు పనులను వారు ప్రారంభించి మాట్లాడారు.

కేయూలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన

కేయూ క్యాంపస్ : కేరళలో వెటర్నరీ స్టూడెంట్ సిద్దార్థను ర్యాగింగ్ పేరుతో కొందరు హత్యచేశారని నిరసిస్తూ కాకతీయ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన తెలిపారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గసభ్యుడు మాచర్ల రాంబాబు మాట్లాడుతూ ర్యాగింగ్ పేరుతో సిద్దార్థను హత్య చేయటం అమానుషం అన్నారు. వెంటనే నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ నిఖిల్, స్టేట్ ఐటీ సెల్ కన్వీనర్ ప్రశాంత్, జిల్లా కన్వీనర్ సుజిత్, సాయి, విష్ణు, ప్రణయ్, శివ తదితరులు పాల్గొన్నారు.

హజ్ బోర్డు చైర్మన్‌కు సన్మానం

కాజీపేట: రాష్ట్ర హజ్‌బోర్డు చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన దర్గా కాజీపేట అఫ్జల్ బియాబాని దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషాను ముస్లిం పెద్దలతో పాటు కాంగ్రెస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, సన్మానించారు.

అమిత్‌షా సభకు తరలిన బీజేపీ శ్రేణులు



హన్మకొండ/మడికొండ/ఖిలావరంగల్: హైదరాబాద్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పాల్గొన్న పోలింగ్ బూత్ సంకల్ప సభకు వరంగల్ పశ్చిమ, తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాల నుంచి బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. తరలివెళ్తున్న వాహనాలను మంగళవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని క్యాంపు కార్యాలయం వద్ద పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మడికొండలో వెంకట్‌రావు, శంభునిపేటలో ఉపేందర్ జెండా ఊపి ప్రారంభించారు.

కార్పొరేషన్ల ఏర్పాటుపై హర్షం

హన్మకొండ/హసన్‌పర్తి /హన్మకొండ అర్బన్/ ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ హర్షం వ్యక్తం చేశారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించడం అభినందనీయమని రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో నిరుపేద రెడ్ల పోరాటాన్ని గుర్తించి రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని ప్రకటించడంపై సంఘ నాయకులు హర్షం చేశారు.